

వైసీపీ హయాంలో జనసత్వాలు కోల్పోయిన బీసీ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊపిరిపోసింది. గత టీడీపీ హయాంలో ఇచ్చిన రుణాలను రికవరీ చేయగా.. వచ్చిన డబ్బులతోనే ఉద్యోగులు జీతాలను తీసుకునే వారు. ఏడాదికి మూడుసార్లు అప్పటి సీఎం జగన్ బటన్ నొక్కే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులను మంజూరు చేసి.. మిగిలిన సమయమంతా అధికారులు, సిబ్బంది కార్యాలయంలో ఖాళీగా ఉండేవారు. ప్రస్తుతం బీసీల సంక్షేమం, అభివృద్ధే నినాదంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రూ.61.25 కోట్లతో 2,800మంది బీసీలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయడానికి శ్రీకారం చుట్టింది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

- వైసీపీ హయాంలో బీసీ కార్పొరేషన్‌కు రూపాయి ఇవ్వని వైనం
- కూటమి అధికారంలోకి వచ్చాక రూ.61.25 కోట్లు మంజూరు
- లబ్ధి పొందనున్న 2,800 మంది

బీసీలకు సబ్సిడీ రుణ మేళా

టీడీపీ హయాంలో..

2014-19 సంవత్సరాల నడుమ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి.. వేలాది మందికి రుణాలను మంజూరు చేసింది. చిన్న టిఫిన్ సెంటర్ నుంచి సూపర్ బజార్ల వరకు ఏర్పాటు చేసుకుని బీసీ, ఉప కులాల వారు ఉపాధి పొందడమే కాకుండా ఆర్థికంగా స్థిర పడ్డారు. అదేవిధంగా బలిజ, కాపు, తెలగ, రజక, నాయీ బ్రాహ్మణ తదితర కులాల వారిని గ్రూపులుగా చేర్చి రూ.10లక్షల నుంచి రూ25లక్షల వరకు రుణాలను మంజూరు చేసి.. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించింది.

కూటమి వచ్చిన ఏడు నెలల వ్యవధిలోనే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల వ్యవధిలోనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 61.25 కోట్లతో 2,800 మందికి సబ్సిడీ రుణాలను పంపిణీ చేయనుంది. బీసీలకు 2,020 యూనిట్లు, బ్రాహ్మణులకు 19, ఈబీసీ కార్పొరేషన్‌కు 103, కమ్మ కార్పొరేషన్‌కు 84, క్షత్రియ కార్పొరేషన్‌కు 13, రెడ్డి కార్పొరేషన్‌కు 75, వైశ్య కార్పొరేషన్‌కు 16, కాపు కార్పొరేషన్‌కు 445 యూనిట్లను మంజూరు చేసింది. ఇందులో బేకరీ, చికెన్, మటన్ షాపు, బొటిక్, గ్రానైట్ పాలీష్ మిషన్, ల్యాండ్రీ షాపు, ఫొటో స్టూడియో తదితర 60రకాల వాటిపై ప్రభుత్వం రుణాలను మంజూరు చేసింది.

వైసీపీ హయాంలో..

2019-24 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌నే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల శాఖ కార్పొషన్లకు ఐదేళ్లపాటు ఒక్క రుణాన్ని కూడా మంజూరు చేయలేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంజూరై.. ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన యూనిట్లను కూడా వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు.

7వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి

సబ్సిడీ రుణాలకు అర్హులైనవారు ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఎనిమిది నుంచి 11వ తేదీవరకు మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో స్ర్కూటినీ జరుగుతుంది. 12 నుంచి 14వ తేదీలోపు బ్యాంకర్లు, ఎంపీడీవో, కమిషనర్లు, బీసీ కార్పొరేషన్ అధికారులతో కూడిన కమిటీ రుణం ఇవ్వాలా వద్దా అని నిర్ణయిస్తారు. ఇలా తయారైన జాబితాను 15 నుంచి 16వ తేదీలోపు కమిటీ నుంచి ఆయా బ్యాంకులకు పంపిస్తారు. వారు సిబిల్ స్కోర్, తదితర వివరాలను పరిశీలిస్తారు. 16 నుంచి 20వ తేదీలోపు ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలు, కమిషనర్లకు పంపుతారు. ఆ తుది జాబితాను 21న కలెక్టర్‌కు, 23న రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు. 24, 25 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ చేశాక 26 నుంచి 28వ తేదీల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయి.



- వచ్చేసిన ఎలక్ట్రిక్ బోట్లు

గంగినేని చెరువులో మళ్లీ బోటు షికారు

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గంగినేని చెరువులో మళ్లీ బోటు షికారుకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో గంగినేని చెరువులో పార్కు, వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేశారు. అలాగే చెరువులో బోటింగ్‌ను ఏర్పాటు చేయడంతో నిత్యం పార్కు పిల్లలు, పెద్దలతో రద్దీగా ఉండేది. ఇక్కడ ఎప్పుడూ ఆహ్లాదకర వాతావరణం ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పార్కు, బోటింగ్ పర్యవేక్షణను పట్టించుకోలేదు. లీజుకు తీసుకున్నవారు బోట్లను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లిపోయారు. అప్పటినుంచి గుర్రపు డెక్కలతో గంగినేని చెరువు కళావిహీనంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గంగినేని చెరువు పూర్వ వైభవం సంతరించుకోనుంది. చెరువు చుట్టూ ఉన్న ముళ్లచెట్లు, నీటిలోని గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. పార్కునూ శుభ్రం చేస్తున్నారు. ఇక బోటింగ్‌కు అవసరమైన ఎలక్ట్రిక్ బోట్లు రెండ్రోజుల కిందట చెరువు వద్దకు వచ్చేశాయి. త్వరలోనే చెరువులో బోటింగ్ ప్రారంభిస్తామని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తెలిపారు.

నేటినుంచి ఇంటి వద్దకే 'రేషన్' పంపిణీ

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బియ్యం కార్డుదారులకు శనివారం నుంచి వాహనాల ద్వారా ఇంటి వద్దకే నిత్యావసర సరకులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శంకరన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5,36,755 కార్డుదారులకు అవసరమైన బియ్యం, చక్కెర, కందిపప్పు చౌకదుకాణాలకు చేరాయన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఇంటి వద్దకు వాహనం వచ్చినప్పుడు కార్డుదారులు ఒక్కసారి బయోమెట్రిక్ వేసి మూడు సరుకులు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. కందిపప్పు సైతం ఎలాంటి కొరత లేదని పౌరసరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ తెలిపారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి తొమ్మిది, ఇంటర్ తరగతుల్లో ప్రవేశానికి లేటరల్ ఎంట్రీ సెలక్షన్ పరీక్ష ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేలాయుధం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 గంటలకు మదనపల్లెలోని నాలుగు కేంద్రాల్లో, ఇంటర్‌లో ప్రవేశానికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మదనపల్లెలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, వివరాలకు హెల్ప్ డెస్క్‌ను 89199 56395, 80743 05048 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ

- ఏకంగా 75 శాతం పెరిగిన రిజిస్ట్రేషన్లు
- నేటినుంచి భూముల విలువ పెరగనుండడమే కారణం

చిత్తూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం రద్దీగా కనిపించాయి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల విలువ పెరగనున్న నేపథ్యంలో చాలామంది క్రయ విక్రయదారులు శుక్రవారం రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. సాధారణ రోజుల్లో జిల్లాలోని 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుమారు 200 రిజిస్ట్రేషన్లు జరిగితే, శుక్రవారం 345 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. చిత్తూరు అర్బన్ కార్యాలయంలో సాధారణ రోజుల్లో 45 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, శుక్రవారం 70 అయ్యాయి. పుంగనూరులో 40 నుంచి 60కి పెరగ్గా, చిత్తూరు రూరల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 30 నుంచి 41కి, కుప్పంలో 30 నుంచి 65కు, నగరిలో 10 నుంచి 32కు, బంగారుపాళ్యంలో 10 నుంచి 14కు, కార్వేటినగరంలో 10 నుంచి 22కు, పలమనేరులో 30 నుంచి 41 రిజిస్ట్రేషన్లకు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా శుక్రవారం 345 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇంటి స్థలాలకు 10 శాతం, భూములకు 15 శాతం, చాలా కాలంగా పెరగని ప్రాంతాలకు 20 శాతం మేర విలువ పెంచుతూ జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. భూముల విలువ పెరగడంతో శనివారం నుంచి స్వల్పంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి.ఈ కారణంగానే శుక్రవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దీగా కనిపించాయి.



చిత్తూరు రూరల్ కార్యాలయం వద్ద రద్దీ



క్రయ విక్రయదారులతో రద్దీగా చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కుప్పానికి లభించని వెసులుబాటు

కుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంపు విషయంలో కుప్పం నియోజకవర్గానికి వెసులుబాటు లభించలేదు.కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని 221 రెవెన్యూ గ్రామాల్లో భూముల విలువను ప్రభుత్వం 15 శాతం పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కాబట్టి,భవిష్యత్తులో పరిశ్రమలు రానున్నాయి కాబట్టి కుప్పంలో భూముల విలువలు పెద్దగా పెంచబోరన్న ప్రచారానికి దీంతో తెరపడింది.జనవరి మొదటి వారంలో కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామిక వేత్తలతో కడా ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కొన్ని దిగ్గజ కంపెనీల స్థాపనకు శంకుస్థాపనలు కూడా చేశారు. మరోవైపు విమానాశ్రయం,కృషి విజ్ఞాన కేంద్ర,కేంద్రీయ విశ్వవిద్యాలయం వంటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కుప్పంలో రానున్నాయి.ఆయా పరిశ్రమలు,కంపెనీలు, సంస్థలకు వేలాది ఎకరాల భూముల కేటాయింపు కూడా ఇప్పటికే జరిగింది.అందులో ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు కూడా ఉన్నాయి. అంతేకాక, కుప్పం పట్టణంలో ప్రధాన రహదారి అయిన నేతాజీరోడ్డు మూడవ రీచ్ విస్తరణ పనుల్లో కదలిక ఏర్పడింది. ఇందువల్ల భూముల విలువల పెంపు విషయంలో ఇక్కడ వెసులుబాటు ఇస్తారన్న ప్రచారం సాగింది. కానీ చివరికొచ్చేసరికి మిగిలిన ప్రాంతాలలాగనే కుప్పంలో సైతం భూముల విలువను 15 శాతానికి ప్రభుత్వం పెంచింది. అయితే నిర్దేశించిన ధరలను అతి స్వల్పంగా తగ్గించింది. ఉదాహరణకు కుప్పం మున్సిపాలిటీలో చదరపు గజం విలువ రూ.6,325కు పెరగగా రూ.25 తగ్గించి రూ.6,300గా నిర్ణయించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రూ.575కు పెంచిన విలువను రూ.15 మాత్రం తగ్గించి రూ.560 గా నిర్ధారించారు. ఈ విషయమై కుప్పం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కుప్పంలో భూముల విలువను 30 శాతం పెంచాల్సిందిగా తొలుత ఆదేశాలందాయన్నారు. అయితే సీఎం నియోజకవర్గం కావడంతో భవిష్యత్తులో అభివృద్ధికోసం కేవలం 15శాతం మాత్రమే పెంచామన్నారు. మళ్లీ ఈ 15 శాతం ధరలను మరింతగా కుదించామని, వాస్తవంగా భూముల విలువ పెరిగింది కేవలం 12 శాతం మాత్రమేనని వివరించారు.

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువ పెంచబోతున్నారని తెలియడంతో ఆలోగా తమ భూములను పాత ధరలతోనే రిజిస్టర్ చేయించుకోవడానికి ప్రజలు ఆతృత పడ్డారు. దీంతో కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గురు, శుక్ర వారాల్లో భూముల క్రయ విక్రయదారులతో దళారులతో కిటకిటలాడింది.గురువారం 49 రిజిస్ట్రేషన్లు జరుగగా, వాటి ద్వారా రూ.5 లక్షల ఆదాయం వచ్చింది. అమావాస్య అయినా కూడా ఆ సెంటిమెంటును పక్కన పెట్టి మరీ ప్రజలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అలాగే శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 38 రిజిస్ట్రేషన్లు జరిగాయి. డిమాండ్ అధికంగా గల ఈ రెండు రోజుల్లోనూ వెబ్ సైట్ నెమ్మది కావడంతో రిజిస్ట్రేషన్లు అనుకున్న స్థాయిలో జరగలేదని కార్యాలయ సిబ్బంది చెప్పారు. వెబ్ సైట్ సమస్య వల్ల గురువారం చేయాల్సిన కొన్ని రిజిస్ట్రేషన్లు మిగిలిపోయి, శుక్రవారానికి వాయిదా వేయాల్సి వచ్చింది. శుక్రవారం కూడా వెబ్ సైట్ సమస్య పూర్తిగా తీరిపోవడంవల్ల రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇటు క్రయ విక్రయదారులు కూడా ఈ సమస్యవల్ల తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేశారు.



కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రద్దీ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం

డయింగ్ యూనిట్లన్నీ మూసివేయాల్సిందే

నగరి మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఏకగ్రీవ తీర్మానం

నగరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):నగరి ప్రజలు ఆరోగ్యంగా వుండాలంటే పట్టణ పరిధిలోని డయింగ్ యూనిట్లను మూసివేయాల్సిందేనని మున్సిపల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.డయింగ్ యూనిట్లను విధిగా మూసివేయించాలి లేక పోతే ఈటీపీ ప్లాంట్లను, ఆర్వోలను అమలు చేయాలన్నారు.నగరి మున్సిపల్ సమావేశం చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది.మున్సిపల్ విప్ దయానిధి, చైర్మన్ నీలమేఘం మధ్య ప్రారంభంలోనే వాదన చోటు చేసుకుంది.డయింగ్ యూనిట్ల విషయం ప్రస్తావించాకే సమావేశపు అజెండాను చదవాలని విప్ డిమాండ్ చేయగా అజెండాను చదివాక ఒక్కో సమస్యపై చర్చించి అనంతరం ఎంత సమయమైనా సరే డయింగ్ యూనిట్ల గురించి చర్చిద్దామని చైర్మన్ పట్టుబట్టారు.అనంతరం అజెండా చదవగా ఒక్కో అంశంపై కౌన్సిలర్లకు సంబంధిత అధికారులచే చైర్మన్ వివరణ ఇప్పించారు.ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల స్థాపనకు అనుమతి కోరగా పరిశ్రమలు వచ్చాక అనుమతి ఇద్దాం అంటూ కౌన్సిలర్ ఇంద్రయ్య పేర్కొన్నారు.తచ్చూరు-చిత్తూరు హైవే రోడ్డుకు ఈకేకే వారికి గ్రావెల్ తరలింపునకు అనుమతి కోరగా అనవసరంగా సమావేశంలో అధికారులు ప్రతిపాదనను చేర్చడం, కౌన్సిలర్లు వద్దన్నా అనుమతులు ఇవ్వడం జరుగుతోందని దయానిధి విమర్శించారు.అలాంటప్పుడు కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనలు ఎందుకు పెడతారనడంతో రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారి చెప్పారు.గత నెల జరిగిన సమావేశంలో డయింగ్ యూనిట్లను మూసివేయాలని తీర్మానం చేసినా ఫలితం లేదన్న దయానిధి టైర్ల కంపెనీ వలన 2000 ఇళ్లలో నివసిస్తున్న వారు కాలుష్యం భరించలేకపోతున్నారని, కాబట్టి ఆ పరిశ్రమను మూసివేయాలని తీర్మానించినా నేటికీ మూసివేయలేకపోతున్నామన్నారు.అలా కాకుండా డయింగ్ యూనిట్ల విషయంలో అందరూ ఒకే మాటమీద వుండాలన్నారు. ఈటీపీ ప్లాంట్లను నడిపితే తప్ప డయింగ్ యూనిట్లు వుండకూడదన్నారు.కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ నగరి పట్టణాన్ని కాలుష్య కోరలనుంచి రక్షించాలంటే అన్ని డయింగ్ యూనిట్లను మూసివేయించాలనగా సభ్యులంతా మద్దతు ప్రకటించారు. డయింగ్ యూనిట్లను పట్టణానికి వెలుపల ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.అనుమతులు లేకనే పలు డయింగ్ యూనిట్లు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.నగరిలో 51 మాన్యువల్, 16 మెకానికల్ డయింగ్ యూనిట్లు నడుస్తున్నాయని, వీటిలో మాన్యువల్ ప్లాంటుకు కామన్ ఈటీపీ ప్లాంటు వుందని,ఎనిమిది మెకానికల్ ప్లాంట్లకు ఈటీపీ గాని, ఆర్వో గాని లేవని, కామన్ ఈటీపీ ప్లాంటును చూపించి అనుమతులు తెచ్చుకున్నారన్నారు.ఒక టన్ను నూలుకు రంగు వేస్తే దాన్ని శుద్ధి చేయడానికి రూ.3లక్షలు ఖర్చవుతుందన్నారు.దీంతో శుద్ధీకరణ చేయకనే డ్రైనేజీ కాలువల్లో, చెరువు కాలువల్లో రంగునీటిని వదిలేస్తున్నారని విమర్శించారు.దీంతో జనం సొరియాసిస్, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికంతటికీ కారణం రంగునీళ్లేనని బీడీ భాస్కర్ తెలిపారు. వీలైనంత త్వరలో అన్ని డయ్యింగ్ యూనిట్ల మూసివేతకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

చిత్తూరు బస్టాండులో క్యూఆర్ కోడ్ ఏర్పాటు

- ఫిర్యాదులు, సలహాల కోసం ప్రయాణికులు ఉపయోగించుకోవచ్చన్న డీపీటీవో



రిజర్వేషన్ కౌంటర్ వద్ద తనిఖీ చేస్తున్న జగదీష్

చిత్తూరు రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఫిర్యాదులు, సలహాల స్వీకరణకు చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు డీపీటీవో జగదీష్ తెలిపారు. శుక్రవారం బస్టాండ్‌ను తనిఖీ చేశారు. క్యూఆర్ కోడ్ చాలా చిన్నదిగా ఉందని, పెద్ద బ్యానర్ల రూపంలో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీకి సంబంధించిన ఏ ఫిర్యాదు, సలహానైనా ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చని చెప్పారు. దీనివల్ల సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్నారు. బస్టాండ్‌లో ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలకు విక్రయించినా, సైకిల్ స్టాండ్, మరుగుదొడ్ల వద్ద ఎక్కువ డబ్బులు వసూలు చేసినా ఉపేక్షించేది లేదని అక్కడున్నవారిని హెచ్చరించారు. మూడుసార్లు ఫిర్యాదువస్తే స్టాల్‌ను, మరుగుదొడ్డి కాంట్రాక్టును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఆయనవెంట పీవో షహజద్ ఉన్నారు.

నేటినుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను జిల్లాలోని 2,66,491 మందికి శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. లబ్ధిదారులకు అవసరమైన పింఛన సొమ్ము రూ.11.20 కోట్లు జిల్లాకు వచ్చిందన్నారు. తొలిరోజే వంద శాతం పింఛన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం నాలుగు గంటల్లోపు ప్రతి పింఛన్‌దారుడి ఇంటి వద్దకెళ్లి సిబ్బంది అందజేయాలన్నారు. గత నెల తీసుకోని వారుంటే ఈ నెలలో పింఛను సొమ్ము అందజేయాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించారు.

కుంభమేళా నమూనా ఆలయంలో

రోజుకు 10వేలమందికి దర్శనం



● టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళాలో టీటీడీ నమూనా ఆలయంలో రోజుకు 8 నుంచి 10 వేలమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అన్నమయ్య భవనంలో శుక్రవారం బోర్డు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల తరహాలోనే శ్రీవారి కైంకర్యాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. తిరుమల నుంచి వెళ్లిన పోటు సిబ్బందితో ప్రసాదాలను తయారు చేసి వితరణ చేస్తున్నామని తెలిపారు. మహాకుంభమేళాలో దాదాపు 250 మందికిపైగా టీటీడీ ఉద్యోగులు సేవలందిస్తున్నారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'లైలా' హీరో



విశ్వక్‌సేన్ - సత్యాత్మతీర్థ స్వామిజీ

కాలినడకన తిరుమలకు చేరుకున్న హీరో విశ్వక్‌సేన్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఫిబ్రవరి 6 'లైలా' సినిమా ట్రైలర్ విడుదల కాబోతున్న సందర్భంగా తిరుమల దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. 'లైలా'లో తాను అమ్మాయి వేషం వేశానని, తన జీవితంలో ఈ సినిమా ప్రత్యేకం అని అన్నారు. ప్రతి సినిమా విడుదలకు ముందు తాను తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నానని తెలిపారు. 'లైలా' విడుదల తర్వాత కూడా మరోసారి తిరుమలకు వస్తానన్నారు. త్వరలో 'ఫంకీ' చిత్రం షూటింగ్ మొదలవుతుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కాగా ఉత్తరాధి మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ, సినీ నిర్మాత సుధాకర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.65 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,349

తలనీలాలు సమర్పించినవారు : 14,082

పాతాళగంగ కాస్త కనికరించింది

● జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం

● తిరుపతికి మాత్రం ప్రమాద ఘంటికలు

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



తుపానులు కురిపించిన వరుస వానలు జిల్లాలో భూగర్భ జలమట్టాలను ఈ ఏడాది స్వల్పంగా పెంచాయి. సగటున జిల్లా మొత్తం పది అంగుళాలు నీటి మట్టం పెరిగింది. తూర్పు మండలాల్లో అయితే ఈ పెరుగుదల గణనీయంగా ఉంది. 2023 డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరు నాటికి ఆశాజనకమైన జలమట్టం కనిపిస్తోంది. తాగునీటికి, సాగుకూ ఇది సంతోషాన్ని కలిగించే అంశం. ఇన్ని వానలు కురిసినా జిల్లా కేంద్రమైన తిరుపతిలో మాత్రం భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. రానున్న వేసవికి ప్రమాదకరమైన పరిస్తితులను ఇవి సూచిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కురిసిన వానలు భూగర్భంలోకి ఇంకే వీలు లేకపోవడం. కాంక్రీటు జనారణ్యంగా మారిపోయిన తిరుపతిలో నీటి కుంటలు, చెరువులు ఆక్రమణలపాలై నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. కొండలమీద కురిసిన వానంతా మాలాడగుండం, కపిలతీర్థం సహా నగరంలోంచే వెల్లువలా ప్రవహించినా చుక్కనీరు నిలిచే అవకాశం లేక కిందికి వెళ్లిపోతున్నాయి. ఈ కాలువల్లో నీరు భూగర్భంలోకి ఇంకకుండా కాంక్రీటు ఫ్లోరింగ్ వేసేయడానికి మించిన అనాలోచిత చర్యల ఫలితమే ఇది. ఈ వానలకు కాళంగి, మల్లిమడుగు నిండి పొంగి పారినా.. కళ్యాణిడ్యాం నిండనే లేదు. యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో వర్షపాతం కూడా తక్కువగానే నమోదైంది. జిల్లా తూర్పు మండలాల్లో వరదయ్యపాళెంలో 0.33 మీటర్లు, కోట 0.84, బీఎన్‌కండ్రిగ 0.85, కేవీబీపురం 0.99, వాకాడు 1.20, పిచ్చాటూరు 1.20, చిట్టమూరు 1.31, చిల్లకూరు 1.48, రేణిగుంట 1.99 మీటర్లు వంతున భూగర్భ జలాలు పెరగడం ఈ ఏడాది విశేషం.

అవసరం మేరకే వాడుకోండి



తిరుపతి జిల్లాలో 2023లో నమోదు అయిన వర్షపాతంతో పోలిస్తే గత డిసెంబరు చివరి నాటికి వర్షాలు బాగా పడ్డాయి. భూగర్భ జలనీటిమట్టాలు పెరిగాయి. అలా అని నీటిని వృథా చేయకూడదు. అవసరం మేరకే వినియోగించుకోవాలి.

- నాగమల్లేశ్వరరావు, జిల్లా భూగర్భ జల అధికారి

భూగర్భ జలాలు ఇలా.. (మీటర్లలో)

	2023 డిసెంబరు	2024 డిసెంబరు
తిరుపతి	14.80	16.86
చంద్రగిరి	4.80	4.76
నగిరి	3.68	3.04
సత్యవేడు	2.94	2.46
శ్రీకాళహస్తి	2.45	2.44
సూళ్ళూరుపేట	1.99	1.72
వెంకటగిరి	2.51	2.24
గూడూరు	1.55	1.76
జిల్లా సగటు	3.19	3.09

2024 జూన్- డిసెంబరు మధ్య వర్షపాతం (మి.మీ.లో)

మండలం	సాధారణం	కురిసింది
గూడూరు	943.2	1.066.7
కోట	1135.1	1456.6
వాకాడు	1113.2	1589.3
చిట్టమూరు	1018.6	1475.8
నాయుడుపేట	982	1231.1
పెళ్లకూరు	1.036	1303.4
డివీసత్రం	1212.8	1569.9
సూళ్ళూరుపేట	1234.2	1889.1
తడ	1294.2	1509.9
తిరుపతి రూరల్	895.7	1288.3
ఎర్రావారిపాళెం	681.1	767.7
పాకాల	886.8	1302
రేణిగుంట	1021.7	1340
శ్రీకాళహస్తి	1177.4	1149.4
తిరుపతి అర్బన్	994.7	1206.4
చంద్రగిరి	906.5	1188.9

ఇంటర్వ్యూ



డాక్టర్ నడింపల్లె సత్యనారాయణరాజు, తిరుపతి పుస్తకోత్సవం నిర్వాహకుడు

భారతీయ భవన్ అనగానే గుర్తొచ్చే పేరు నడింపల్లె సత్యనారాయణరాజు. తిరుపతిలో 20 ఏళ్లుగా పుస్తక ప్రదర్శల నిర్వహణ వెనుక ప్రధాన వ్యక్తీ, శక్తీ ఆయనే. టీటీడీ అధికారుల సహకారం తీసుకుంటూ, తిరుపతిలోని మేథోవర్గం సహాయం అందుకుంటూ పుస్తకోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వహణ అంత తేలికైన పని కాదు. పుస్తకం మీద ఉన్న ఇష్టం, భావి తరాల పట్ల ఉన్న బాధ్యత ఆయనను వయసును లెక్క చేయకుండా పుస్తకోత్సవ సారధిగా నడిపిస్తోంది. పుస్తకోత్సవాల నిర్వహణ సాదకబాధకాలపై భారతీయ విద్యా భవన్ తిరుపతి డైరెక్టర్ డాక్టర్ నడింపల్లె సత్యనారాయణ రాజుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ఈ తరం పుస్తకం చేత పట్టాలి



● తిరుపతిలో ఎలా మొదలైంది?

! 2006 లో భారతీయ విద్యా భవన్ స్వతంత్రంగా తిరుపతి పుస్తక ప్రదర్శనను ప్రారంభించింది. మొదట త్యాగరాజ మండపంలో నిర్వహించేవాళ్లం. సందర్శకుల సంఖ్య పెరగడంతో దానిని ఎస్వీ హైస్కూల్ మైదానంలోకి మార్చాం. ప్రస్తుతం విశాలమైన వినాయక నగర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నాం. ఇరవై ఏళ్ళుగా తిరుపతి పుస్తక ప్రదర్శన మార్పుచేర్పులతో కొనసాగుతూ ఉంది.

● ఉద్దేశ్యం ఏమిటి?

! ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించిన ప్రముఖులందరూ మంచి పుస్తకాలు చదివి స్ఫూర్తి పొందిన వారే. పుస్తకం మనిషిని తీర్చి దిద్దుతుంది. ఆధునిక సాంకేతికత పెరగడంతో పుస్తక పఠనం తగ్గింది. టీవీలు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వెంట పరుగులు తీస్తున్న తరాన్ని మళ్లీ పుస్తకాల వెంట నడిపించాలనే ఆలోచనతోనే బాధ్యతగా భారతీయ విద్యా భవన్ పుస్తకోత్సవాలను ఏటా నిర్వహిస్తోంది.

● నిర్వహణలో కష్టనష్టాలు?

! దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పబ్లిషర్స్‌ను, విక్రేతలను తిరుపతికి రప్పించడం అంత సులువు కాదు.అందరినీ ఒక చోటుకి తీసుకువచ్చినా ప్రజలు రావాలి కదా. అన్ని విద్యాసంస్థలను సంప్రదించి, విద్యార్థులను తీసుకువచ్చి, వారికి ప్రతిభా పోటీలు నిర్వహించి,బహుమతులు అందించే పని చేస్తున్నాం.సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనకు వచ్చినవారు రెండు మూడు గంటల పాటూ ప్రాంగణంలో గడుపుతారు. వీరి కోసం ఫుడ్ స్టాల్స్ కూడా ఉంటాయి. ఇవన్నీ కష్టమైన పనులే కానీ ప్రయాసగా భావించడం లేదు. భవిష్యత్ తరాలకు పుస్తకాన్ని వారసత్వంగా అందించే బాధ్యత అనుకుని నిర్వహిస్తున్నాం.

● ఆర్థిక వనరులు ఎలా?

! ఒక సారి పుస్తక ప్రదర్శన నిర్వహించాలంటే రూ. 11 లక్షలు ఖర్చు అవుతుంది. ఒక్కో స్టాల్‌కు రూ. 12 వేల చొప్పున ప్రవేశ రుసుం నిర్ణయించాం. ఇలా రూ. 6 లక్షలకు పైగా నిధులు వస్తున్నాయి. మిగిలిన ఆర్థిక భారాన్ని భారతీయ విద్యా భవన్ ద్వారా వెచ్చిస్తున్నాం. టీటీడీ కొన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉంది. ఇది కొంత ఊరటను ఇస్తూ ఉంది.

● భవిష్యత్తులో ఏ మార్పులు అవసరం?

! ఇరవై ఏళ్ల క్రితం తిరుపతికీ, ఇప్పటి తిరుపతికీ చాలా మార్పులున్నాయి. ఐఐటీ, ఐజర్, వేద వర్సిటీ వంటి సంస్థలు నెలకొన్నాయి. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కాలేజీలు పెరిగాయి. విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే వీరికి పుస్తకాల అవసరం పెరిగింది. ఆయా రంగాల్లో మరింత జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉన్న అవకాశాలను కల్పించాలి. పుస్తక ప్రదర్శన ఇందుకు వేదిక అవుతోంది. టెక్నాలజీతో పాటు ఇతర అంశాలతో కూడిన పుస్తకాల సంఖ్య ప్రదర్శనలో పెరగాలి. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణ, పుస్తక విక్రయ సంస్థలను తిరుపతికి తీసుకురావాలని కోరిక. హైదరాబాద్, విజయవాడ పుస్తక ప్రదర్శనలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో తిరుపతి పుస్తక ప్రదర్శన చేపట్టాలనే లక్ష్యం ఉంది.పుస్తక ప్రేమికుల ఆదరణతో ఇది సాధ్యమవుతుందనే నమ్మకమే నడిపిస్తోంది.

ఎగబాకుతున్న వెనామి రొయ్యు పిల్లల ధర



హేచరీలో రవాణాకు సిద్ధంగా ఉన్న రొయ్యు పిల్లలు



ప్యాక్‌చేసిన వెనామీ సీడ్

కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వెనామి రొయ్య పిల్లల ధర స్వల్పంగా పెరుగుతోంది. నిన్న మొన్నటి వరకు అందుబాటులో ధరల్లో లభ్యమైన వెనామి రొయ్య పిల్లలు నాణ్యత, బ్రోడర్(తల్లిరొయ్య) డిమాండ్ పేరుతో ధరలు ఎగబాకుతున్నాయి. సముద్ర తీరప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో గత ఏడాదిగా రొయ్యల సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించిన ఆక్వా రైతులు మంచు తగ్గిపోవడం, రొయ్యపిల్లలకు అనుకూల వాతావరణం వస్తుండటంతో వెనామి సాగుకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో హేచరీల యజమానులు రొయ్యపిల్లల ధరలు పెంచేస్తున్నారు. తల్లిరొయ్యలను అమెరికా, తైవాన్, ఇండోనేషియా, జపాన్ దేశాల నుంచి పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు దిగుమతి చేసుకొని హేచరీల్లో పిల్లరొయ్యను ఉత్పత్తి చేస్తారు. ఆయా దేశాల్లో తల్లిరొయ్యలు ధరలు పెరిగాయని, నాణ్యమైన, ఆరోగ్యవంతమైన వెనామి రొయ్యపిల్లలు కావడంతో ధరలు పెంచుతున్నట్లు హేచరీల యజమానులు చెబుతున్నారు. ఇటీవల వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు పాండిచ్చేరి ప్రాంతాల్లోని హేచరీల్లో వెనామి రొయ్యపిల్ల 30 పైసలు ఉండేది. ప్రస్తుతం నాణ్యత పేరుతో 36 పైసలకు విక్రయిస్తున్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతుండడంతో రొయ్యల సాగు విషయమై ఆక్వా రైతులు సందిగ్ధంలో పడిపోయారు.

నాటు తుపాకీ స్వాధీనం.. ఒకరి అరెస్టు

భాకరాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ చిట్టేచెర్ల వలసదేవరగుట్ట ఎస్టీ కాలనీకి చెందిన చుక్కలపాటి వెంకటేశ్ నాటు తుపాకీ కలిగి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం ఉదయం ఎస్ఐ రాఘవేంద్ర తన సిబ్బందితో దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పంటలను ధ్వంసం చేసిన గజరాజులు



ఏనుగులు తొక్కేసిన టమోటా

ఎర్రావారిపాళెం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకాడపల్లె పంచాయతీలో ఏనుగుల మంద పంట పొలాలను ధ్వంసం చేసింది. శుక్రవారం వేకువజామున 15 గజరాజుల గుంపు కోటకాడపల్లెకు చెందిక తుల్లూరు చంద్ర, మరి కొందరు రైతుల వరి, టమోట, కాయగూర తోటలను తొక్కి, తిని నాశనం చేశాయి. అధికారులు స్పందించి ఏనుగులను అడవుల్లోకి మళ్లించాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఐసీడీఎస్ పీడీగా వసంతబాయి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వసంతబాయి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీగా వసంతబాయి కలెక్టరేట్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఐసీడీఎస్‌గా పనిచేస్తున్న జయలక్ష్మి పదోన్నతిపై ఒంగోలుకు బదిలీ అయ్యారు.

పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా తీసుకువచ్చిన క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 130 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ప్రతి క్లస్టర్‌లో 5 నుంచి పది పాఠశాలలు ఉంటాయని తెలిపారు. పాఠశాలలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను బట్టి మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో వంతెనలు, చెరువులు దాటడం, ఎక్కువ దూరం ప్రయాణం చేసే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో కేవీఎన్ కుమార్, డిప్యూటీ ఈవో బాలాజీ, ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.48 కోట్లు

● దక్షిణ మధ్య రైల్వే జీఎం జైన్



కల్యాణ మండపం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జీఎం

తిరుపతి(సెంట్రల్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.48 కోట్లు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. తిరుపతి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో రూ.6.62 కోట్లతో నిర్మించనున్న రైల్వే కల్యాణ మండపానికి భూమిపూజ చేశారు. జీఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులకు ఈ కల్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు ప్రధాన రైలు మార్గాలకు కేంద్రమైన రేణిగుంట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే విడుదలైన రూ.25 కోట్లతో రేణిగుంట సీఆర్ఎస్ లూప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. చెన్నై-తిరుపతి, పూడి-ఏర్పేడు బైపాస్ మార్గాలు, గూడూరు-రేణిగుంట మూడవ రైలు మార్గం పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వెంకటగిరి-నడికుడి మధ్య నూతన రైలు మార్గానికి కూడా నిధులు మంజూరయ్యాయన్నారు. తిరుపతి, పాకాల రైల్వేస్టేషన్ల మధ్య రెండవ లైన్ రైలు మార్గానికి రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ఆయన తిరుపతి ప్రధాన రైల్వేస్టేషన్ దక్షిణం వైపు రూ.300 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని, అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం రేణిగుంటకు చేరుకుని గుంతకల్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, అధికారులు సూర్యనారాయణ, రమణారెడ్డి, శ్రీనివాస్, క్యాప్టిల్ అరోరా, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐపీఎఫ్ మధుసూదన్, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

తిరుపతి పర్యటనకు విచ్చేసిన రైల్వే జీఎం జైన్‌ను రైల్వే ఉద్యోగ సంఘాల నాయకులు సన్మానించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు నాయకులు బీఎం బాషా, రవీంద్ర నాయక్, మారయ్య, యూనియన్ మాజీ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు, కళాధర్, వెంకటముని, సంఘ్ నాయకులు బాబు, జయకుమార్ పాల్గొన్నారు.

భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన


ఇద్దరు ఉద్యోగుల బదిలీ!

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసినట్లు తెలిసింది. చైర్మన్ సిఫార్సుతో శ్రీవారి దర్శనం కోసం వీఐపీ బ్రేక్‌లో వెళ్లిన తనతో ఆలయంలోని దఫేదార్, సూపరింటెండెంట్ దురుసుగా మాట్లాడినట్టు చైర్మన్, టీటీడీ ఉన్నతాధికారులకు ఆ భక్తుడు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆ ఇద్దరిని బదిలీ చేసినట్టు తెలిసింది. ఇక, వైకుంఠ ఏకాదశిరోజున వరాహస్వామి దర్శనం కోసం వెళ్లిన ఓ బోర్డు సభ్యురాలిని ఆలయంలోకి అనుమతించకుండా దురుసుగా మాట్లాడిన మరో ఉద్యోగిని కూడా సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఇటీవల శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తులతో ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు అధికమయ్యాయి. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్న నిర్ణయంలో భాగంగా ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

నకిలీ టికెట్లతో భక్తులను బురిడీ కొట్టించిన దళారీ

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): నకిలీ టికెట్లతో ఓ దళారీ హైదరాబాద్ భక్తులను మోసగించాడు. హైదరాబాద్‌కు చెందిన ఉపేందర్ శ్రీవారి దర్శనం కోసం నళినికాంత్ అనే స్నేహితుడి ద్వారా సతీష్ అనే వ్యక్తిని సంప్రదించారు. దళారీ అయిన సతీష్ జనవరి 12వ తేదీన మూడు టికెట్ల కోసం ఫోన్‌పే ద్వారా రూ.2,100 డబ్బులు తీసుకున్నాడు. అనంతరం రూ.10 లక్షల దాత కోటాలో టిక్కెట్లను ఈనెల 18వ తేదీన భక్తుడు ఉపేందర్‌కు సతీష్ పంపాడు. ఈ క్రమంలో భక్తులు 29వ తేదీన ఉదయం 10.15 గంటలకు తిరుమలకు చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు వెళ్లారు. టికెట్ స్కాన్ కాకపోవడంతో డోనార్ సెల్‌ను సంప్రదించాలని అక్కడి సిబ్బంది సూచించారు. డోనార్ సెల్‌కు వెళ్లిన భక్తులకు ఈ టికెట్లు నకిలీవని తేలింది. దీనిపై భక్తులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా విక్రమ్‌కుమార్‌రెడ్డి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా విక్రమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా పనిచేస్తున్న చెన్నయ్య చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనకు ఉమ్మడి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీ బాధ్యతల స్వీకారం



కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో చెన్నయ్య

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా చెన్నయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఇక్కడ డీడీగా ఉన్న రాజ్యలక్ష్మి బదిలీపై కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వెళ్లారు. తిరుపతిలో డీడీగా ఉన్న చెన్నయ్య బదిలీపై ఇక్కడికొచ్చారు. డీడీ ముందుగా కాణిపాకం వరసిద్ధివినాయక స్వామిని దర్శించుకున్నారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వలంటీర్ ఆర్గనైజేషన్ (ఎన్జీవో)లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందడానికి ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి అంశాలకు సంబంధించిన ఎన్జీవోలు నడుపుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : డీఐఈవో



సమావేశంలో ప్రసంగిస్తున్న సయ్యద్ మౌల

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి మొదలయ్యే నైతిక, మానవీయ విలువలు, పర్యావరణ విద్య అంశాలపై నిర్వహించే పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి (డీఐఈవో) సయ్యద్ మౌల అన్నారు. శుక్రవారం తన సమావేశ మందిరంలో కళాశాలల ప్రిన్సిపాళ్లతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఇంటర్ ఫస్టియర్‌లో జిల్లా వ్యాప్తంగా 15,482 మంది విద్యార్థులు ఫిబ్రవరి 1, 3 తేదీల్లో నిర్వహించే పరీక్షలు తప్పనిసరిగా రాయాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రత్యేక అధికారిగా దయానందరాజు, సభ్యులుగా బాలసుబ్రహ్మణ్యం, నిర్మలాకుమారి, శరశ్చంద్రశేఖర్, డిస్ట్రిక్ బల్క్ అధికారిగా హేమలత వ్యవహరిస్తారని తెలిపారు.ఈనెల 5నుంచి 40 ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో, 10 నుంచి 140 కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారన్నారు.మార్చిలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఉంటాయన్నారు. డీఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేపై కేంద్ర బృందం పరిశీలన



లెప్రసీ అధికారి కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్రం బృంద సభ్యులు

చిత్తూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి లెప్రసీ సర్వేను కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. ముందుగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న జిల్లా టీబీ నివారణ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. లెప్రసీకి సంబంధించిన రికార్డులన్నీ పరిశీలించారు. జిల్లాలో లెప్రసీ నివారణకు తీసుకుంటున్న చర్యలను టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీడీనెల్లూరులోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. జీడీనెల్లూరు సబ్ సెంటర్ పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి లెప్రసీ ఇంటింటి సర్వేను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రంగనాథ్, డాక్టర్ అక్షత్ పురోహిత్, డాక్టర్ జావిద్, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ సాయి షర్మిల, డీఎస్ఎంవో శ్రీనివాసులు, డీపీఎంవోలు రవికుమార్, జాన్ పాల్గొన్నారు.

తుమ్మింద ప్రభుత్వ బడిలో 3 టీవీల చోరీ



పోలీసులు వచ్చే వరకు గేటు బయట వేచి ఉన్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం రాత్రి మూడు ఎల్ఈడీ టీవీలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం ఉదయం పాఠశాల శుభ్రం చేయడానికి వెళ్లిన స్వీపర్.. గది తాళాలు పగలగొట్టి ఉండడాన్ని చూసి హెచ్ఎం లలితకు సమాచారం ఇచ్చారు. మూడు (55 ఇంచులవి రెండు, 32 ఇంచులది ఒకటి) ఎల్ఈడీ టీవీలు చోరీకి గురైనట్లు ఆమె గుర్తించారు. ఈ మేరకు హెచ్ఎం ఫిర్యాదుతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఈడబ్ల్యూఐడీ ఈఈగా మురళీధర్‌రెడ్డి

చిత్తూరు కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఎడ్యుకేషన్, సంక్షేమ మౌలిక వసతుల కల్పనా సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీ) ఈఈగా మురళీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈఈగా పనిచేస్తున్న సుబ్బరాయలు నెల్లూరు జిల్లాకు బదిలీ అవడంతో రిలీవ్ అయ్యారు. నూతన ఈఈ రెండ్రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

జైన్ ఫ్యాక్టరీస్ వైస్ ప్రెసిడెంట్ మృతి



షమీర్‌శర్మ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పంచాయతీ పరిధిలోని జైన్ ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీల సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ షమీర్‌శర్మ శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సుమారు 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఈయన వివిధ ఆలయాలకు, హైస్కూల్స్‌లో క్రీడా పోటీలప్పుడు అవసరమైన భోజన సౌకర్యాలు ఫ్యాక్టరీ తరపున కల్పించి.. వారి మన్ననలు చూరగొన్నారు. ఈ సమాచారం తెలియడంతో రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. ఆయన మృతి తీరని లోటని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షమీర్‌శర్మ మృతి చెందారని తెలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి లావణ్య, వైఎస్సార్‌టీయూసీ జైన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డితోపాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, ఉద్యానశాఖ అధికారులు, జిల్లా మామిడి యూనియన్‌కు చెందిన నేతలు, స్నేహితులు, జైన్ ఫ్యాక్టరీలకు మామిడి కాయలు సరఫరాచేసే కాంట్రాక్టర్లు, రైతులు, సిబ్బంది, కార్మికులు వేర్వేరుగా షమీర్‌శర్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

రామకుప్పం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిధిలో మతిస్థిమితంలేని ఓ బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై గురువారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ కథనం మేరకు .....మతిస్థిమితం లేని బాలిక(16)పై సింగసముద్రానికి చెందిన మురళి(24)బుధవారం రాత్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం మురళీపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

కానిస్టేబుల్ కుమార్తె ఆత్మహత్య!

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో ఓ కానిస్టేబుల్ కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. ఇంజనీరింగ్ చదివిన ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకున్నట్లు తెలిసింది. ఎస్ఆర్‌పురంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ పలమనేరు రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఆయన డ్యూటీకి వెళ్లిన సమయంలో ఆమె ఉరి వేసుకుందని సమాచారం. రాత్రి పూట కావడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు.



ఫ్లై ఓవర్ కింద.. నాయుడు బిల్డింగ్స్ వీధిలో గంజాయి విక్రయదారులతో విద్యార్థుల మంతనాలు

గంజాయి గుప్పు.. గుప్పు..!

చిత్తూరు నగరంలో నడి రోడ్డుపై విద్యార్థులే టార్గెట్‌గా విక్రయాలు

'గంజాయి అక్రమ రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం. ఎంతటివారైనా కటకటాల్లోకి పంపిస్తాం' ఇదీ నిత్యం కళాశాలల్లో నిర్వహించే అవగాహన సదస్సుల్లో పోలీసు అధికారుల మాట.

అయితే పోలీసు అధికారుల మాటలకు వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉంది. పట్టపగలే గంజాయి మత్తులో విద్యార్థులు ఉంటున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలోనూ ఈ విషయాలు బయటపడ్డాయి.

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయం, వాడకం ఇప్పుడు చిత్తూరులో విస్తృతమైంది. విద్యార్థులను టార్గెట్ చేసుకుని, పోలీసుల కళ్లుగప్పి విక్రయాలను జరుపుతున్నారు. బస్టాండులు, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం, రిలయన్స్ ఎదురుగా, రైల్వే అండర్ బ్రిడ్జి, పాత బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

పట్టించుకునే వారేరి?

కళాశాలలు ముగిశాక, ముందు కొందరు విద్యార్థులు గంజాయిని తీసుకునే తరగతులకు వెళుతున్నారు. దీనికితోడు గంజాయి విక్రయదారులపై పోలీసుల నిఘా కొరవడిందన్న విమర్శలూ ఉన్నాయి. అందువల్లే తరచూ గంజాయి మత్తులో విద్యార్థులు ఘర్షణలకూ దిగుతున్నారు.

దిగుమతి అవుతోందిలా..!

చిత్తూరుకు గంజాయి రోజూ విజయవాడ, నెల్లూరు, గుంటూరుతోపాటు తమిళనాడు నుంచి రైలు, బస్సుల ద్వారా దిగుమతి అవుతున్నట్లు సమాచారం. ఇలా వచ్చాక ముందుగానే ఎంపిక చేసుకున్న కళాశాలల వద్దకు వెళ్లి విక్రయిస్తున్నారు. అలాగే వీరి వద్ద నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్మగ్లర్లతో స్థానిక గంజాయి విక్రయదారులు కూడా కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

రామకుప్పం మండల మీట్‌లో నిరసనలు

● బహిష్కరించిన పలువురు ఎంపీటీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్రహ్మణ్యం - సమావేశాన్ని బహిష్కరించిన టీడీపీలో చేరిన ఎంపీటీసీలు

రామకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు నిరసనలు చేపట్టారు. తమకు గుర్తింపు లేనప్పుడు తమను ఎందుకు సమావేశాలకు పిలుస్తారని ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. ఉదయం 10.30 గంటలకే డీఎల్‌పీవో రాధాకృష్ణ, తహసీల్దారు బాబు, ఎంపీడీవో మురళీధర్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు చేరుకున్నా.. 11 గంటలకు ఎంపీపీ సుబ్రహ్మణ్యంతోపాటు పలువురు ఎంపీటీసీలు వచ్చారు. ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామగౌడు, మంజునాథ్‌ల ఆధ్వర్యంలో పలువురు సభ్యులు కొంతసేపటికే తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు 18 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, మండల పరిషత్ నిధులను తమకు కేటాయించకుండా ఇతర వ్యక్తులు పనులు చేపడుతుండటం దారుణమని వాపోయారు. టీడీపీ కార్యాలయంలో నేతలతో సంప్రదింపుల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశానికి హాజరయ్యారు.

ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కో-ఆప్షన్ సభ్యుడు బర్కతుల్లా మాట్లాడుతూ గతంలో ఎంపీటీసీలు, సర్పంచులు చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు చేయడం లేదని వాపోయారు. అనంతరం పలుశాఖల పనితీరుపై అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సుమారు రెండేళ్ల క్రితం ఎంపీపీగా ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన మణీంద్రం ఎంపీటీసీ సభ్యురాలు శాంతకుమారి పేరిట సమావేశంలో ఓ కుర్చీ ఏర్పాటు చేయడం గమనార్హం.

జాతీయ స్థాయిలో కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ



బహుమతి అంకుంటున్న విద్యార్థులు శివశంకర్, పేచిముత్తు

కుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం మహాలి ప్లక్షా యూనివర్శిటీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యంగ్ క్రియేటర్స్ లీగ్‌లో కుప్పంలోని డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థి ఎన్.శివశంకర్ అద్భుత ప్రతిభ కనబరచి మొదటి బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. గుడుపల్లె మండలం గుడివంకలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ హబ్‌తోపాటు పలువురు అధ్యాపకుల సహకారంతో గుడుపల్లె మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి ఎస్.పేచిముత్తుతో కలిసి శివశంకర్ రూపొందించిన 'ఇన్నోవేటివ్ వీల్ చెయిర్ డిజైన్డ్ ఫర్ లింబ్ ఇంపెయిర్డ్ యూజర్స్' అనే ప్రాజెక్ట్ ప్రథమ స్థానం పొంది రూ.25 వేలు రివార్డు లభించిందన్నారు. దేశంలోని వివిధ కళాశాలలు, వివిధ పాఠశాలల నుంచి 400 ప్రాజెక్టులు ప్రదర్శించగా.. అందులో 51 ప్రాజెక్టులు ఫైనల్ పోటీకి చేరుకున్నాయని.. చివరకు శివశంకర్, పేచిముత్తులు రూపొందించిన ప్రాజెక్ట్ ఈ ఘనత సాధించిందన్నారు. ట్రిపుల్ ఈ విభాగాధిపతి సీహెచ్. సుబ్బన్న, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అందించిన సహాయ సహకారాలకు ప్రిన్సిపాల్ జగన్నాథరావు ధన్యవాదాలు తెలిపారు. జి.రామకృష్ణరావు, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ జీఎస్.రమేశ్, సిబ్బంది, విద్యార్థులు విజేతలను అభినందించారు.

ఒక ఆలోచన



గ్రామాలకు తిరుగుతూ ప్రయాణీకులకు సేవలందిస్తున్న కన్వర్షన్ పల్లెవెలుగు బస్సు

బస్సునే మార్చేసింది!

● స్ర్కాప్ నుంచి పల్లె వెలుగుగా.. ● తిరుపతిలో ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్'

ఒక చిన్న ఆలోచన.. స్ర్కాప్‌కు వెళ్లాల్సిన బస్సులను 'పల్లె వెలుగు' సర్వీసులుగా మార్చింది. బస్సుల కొరతను ఎదుర్కొనేందుకు ఉపయోగపడింది. గతేడాది మొదలు పెట్టిన ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్' ప్రక్రియ.. తిరుపతి డిపోలోని ఎనిమిది బస్సుల రూపాలను పూర్తిగా మార్చేసింది. - తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి



స్ర్కాప్ నుంచి పల్లెవెలుగుగా మారుతున్న బస్సు

గతేడాది జనవరిలో 15 ఏళ్లు దాటిన కొన్ని సూపర్ లగ్జరీ బస్సులను స్ర్కాప్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో కొన్ని గ్రామాలకు నడిపేందుకు పల్లెవెలుగు బస్సుల కొరత ఏర్పడింది. కొత్త బస్సులు వచ్చే అవకాశాలు కనబడలేదు. పైగా స్ర్కాబ్‌కు పంపాలని పక్కన పెట్టిన బస్సులలో కొన్ని విడిభాగాలు బాగున్నాయి. దీంతో అప్పటి డీపీటీవోగా ఉన్న చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈగా ఉన్న జి.నరసింహులు సమాలోచనలు జరిపి.. తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, గ్యారేజీ సిబ్బందితో చర్చించారు. దాని ఫలితమే 'బస్సు బాడీ కన్వర్షన్'. వీరు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపిన ప్రతిపాదనలకు అక్కడి అధికారులు అంగీకరించి తిరుపతితో పాటు ఇతర జిల్లాలకూ అనుమతులిచ్చారు. బస్సు బాడీ కన్వర్షన్ ప్రక్రియను అనుసరించాలని ఆదేశించారు. తిరుపతిలో తొలుతగా ఓ సూపర్ లగ్జరీ బస్సుపై ప్రయోగాత్మకంగా పనులు మొదలుపెట్టారు. ఉపయోగ పరికరాలు మినహా పాడైనవాటిని తొలగించి స్ర్కాప్‌కు వేశారు. రేకులు, సీట్లు, పిల్లర్స్, రంగులు, టైర్లు, లైటింగ్, బ్రేకులు, గేర్‌బాక్సు, ఎయిర్‌ఫిల్టర్, ఇతర సాంకేతిక పరమైన వాటిని కొత్తగా అమర్చారు. వీటికి సుమారు రూ.1.5 లక్షలు ఖర్చు పెట్టి.. 52 సీట్ల సామర్థ్యంతో పల్లెవెలుగు బస్సుగా మార్చారు. కొన్ని రోజుల పాటు డిపోలోనే నడిపి పరిశీలించారు. తర్వాత సిబ్బందిని ఎక్కించుకొని తిప్పారు. ఎలాంటి సమస్య ఎదురు కాకపోవడంతో అనుభవమున్న డ్రైవర్ ధనాంజనేయులను ఎంపికచేసి తిరుపతి నుంచి పళ్లిపట్టుకు నడిపారు. ఈ ప్రయోగం విజయవంతమైంది. దాంతో కాలం చెల్లిన బస్సులను అవసరమైన సంఖ్యలో పల్లెవెలుగు బస్సులుగా మార్చుకోవాలని పూర్తిస్థాయి అనుమతులు వచ్చాయి.

గత ఏడాది 8 బస్సుల బాడీ కన్వర్షన్

2024 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రక్రియలో మొత్తం 8 బస్సులను పల్లెవెలుగు బస్సులుగా మార్చారు. రాష్ట్రంలోని 128 డిపోలలో అత్యధిక సంఖ్యలో బస్సు బాడీ కన్వర్షన్ జరిగింది క్క తిరుపతి డిపోలోనే. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించిన కోచ్‌బిల్డర్స్ అండ్ వెల్డర్స్ రాజ్‌గోపాల్, సుబ్బరాజు, అంకయ్య, గురవయ్య, గోపికి ప్రశంసా పత్రాలు అందించారు. కొత్తగా నాలుగు అల్ట్రాడీలెక్స్ బస్సులు రాగానే.. పాతవాటిని ఇదే తరహాలో కన్వర్షన్ చేయనున్నారు.



పల్లెవెలుగు బస్సులుగా మార్చేందుకు రెడీగా ఉన్న స్ర్కాప్ బస్సులు

అడవిచేనులో ఐదు మేకల మృతి

చంపింది రేసు కుక్కలా? చిరుత పులా??

దర్యాప్తు చేస్తున్న అటవీశాఖ అధికారులు



గుడిపాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని అడవిచేను అటవీప్రాంతంలో బుధవారం ఐదు మేకలు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అడవిచేను గ్రామం గుండాలవంక పరిసర ప్రాంతాల్లో గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్న రామకృష్ణనాయుడికి చెందిన ఐదు మేకలు బుధవారం మేతకోసం వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన ఆయన సమీప అటవీ ప్రాంతంలో గురువారం పరిశీలించగా ఐదు మేకలు మృతి చెంది ఉన్నాయి. ఈ మేకలను పులి దాడిచేసి చంపిందా..? లేక రేసుకుక్కలా? అన్న కోణంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎందుకంటే పులి సంచరిస్తుంటే ఒక్కో మేకను తీసుకెళ్తుందే తప్ప, ఒక్కసారిగా ఇన్నింటిని చంపదని తెలిపారు.



ఏనుగులు తొక్కేసిన వరి పంట

ఏనుగుల దాడిలో పంటలకు నష్టం



విరిచేసిన మామిడి చెట్టు

బంగారుపాళ్యం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని గురువారం రాత్రి ఏనుగులు గుంపు పంట పొలాలపై పడింది. గ్రామానికి చెందిన సుగుణ, తంగవేలుకు చెందిన పొలంలోని కొబ్బరి, మామిడి చెట్లను విరిచి, వరి పంటను తొక్కేశాయి. నల్లగుట్టచెరువు సమీపంలో ఏనుగుల తిష్టవేసి, రాత్రి పూట పొలాలపై పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు ఏనుగుల దాడుల అరికట్టలేక పోతున్నారని చెప్పారు. ప్రభుత్వం అందించే నామమాత్రపు నష్టపరిహారంతో తమకు పెద్దగా ఉపయోగం ఉండదని రామయ్య అనే రైతు వాపోయాడు.

తిరుపతిలో నేటినుంచి పుస్తక ప్రదర్శన

కొలువుదీరనున్న 70 ప్రచురణ, విక్రయ సంస్థల స్టాళ్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నేటి నుంచీ పుస్తకాల పండుగ మొదలవుతోంది. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో ఏటా జరిగే బుక్ ఎగ్జిబిషన్ ఈ ఏడాది కూడా ఇస్కాన్ ఆలయం ఎదురుగా వున్న వినాయకనగర్ మైదానంలో నేటినుంచీ 9వ తేది వరకూ నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 70 స్టాళ్ళు తరలి రానున్నాయి. టీటీడీ పబ్లికేషన్స్, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, ఎమెస్కో పబ్లికేషన్స్, విజయవాణి ప్రింటర్స్, సాహిత్య అకాడమీ, అరవిందో సొసైటీ, వేద వర్సిటీ, నవరత్న బుక్ వరల్డ్, వాసవి బుక్ సెంటర్ తదితర సంస్థలు ఈ ప్రదర్శనకు హాజరు కానున్నాయి. ప్రదర్శనా ప్రాంగణంలో రోజూ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. పుస్తకావిష్కరణలు, పుస్తక పరిచయాలు వంటి కార్యక్రమాలు రోజూ జరుగుతాయి.శనివారం సాయంత్రం 5 గంటలకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించనున్నారు. ప్రారంభ సభలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, కలెక్టర్ వేంకటేశ్వర్ అతిథులుగా హాజరు కానున్నారు.2వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచీ రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తారు.తరువాత రోజూ మధ్యాహ్నం 1 నుంచీ రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన వుంటుంది.సాయంత్రం 6 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. 9వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు తిరుపతి పుస్తక ప్రదర్శన ముగింపు సభ నిర్వహిస్తారు. ఇందులో ఐజర్ డైరెక్టర్ ఆచార్య శంతను భట్టాచార్య, సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ మాజీ వీసీ డాక్టర్ బి. వెంగమ్మ, ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారు.

కుప్పం ఇన్‌చార్జి ఎంపీడీవోగా విజయదత్



ఎంపీడీవో విజయదత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

కుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ విజయదత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న సాయి లహరి ఆరు నెలల శాఖాపరమైన శిక్షణకు వెళ్లారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయదత్‌ను మండల సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ కలసి పనిచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాల మేరకు మండలాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వీధి బాలలను అవహేళన చేయడం నేరం



మాట్లాడుతున్న న్యాయవాది భాస్కర్

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వీధి బాలలను అవహేళన చేయడం నేరమని సీనియర్ న్యాయవాది ఎల్.భాస్కర్ అన్నారు. శుక్రవారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా పలమనేరు నార్తు పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల ప్రాథమిక హక్కులు, విధులపై వివరించారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు అరీఫుల్లాఖాన్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందుకున్న విద్యార్థులు

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన విద్యాసామగ్రిని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన జాప్ స్పోర్ట్ సంస్థ అధినేత ముఖేష్ సింగ్ మాట్లాడుతూ ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం, ఫౌండేషన్ అధినేత ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, లోకేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

● వి.కోట: కుంబార్లపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందించారు. ఎంఈవో చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు రఫీ, సంస్థ సౌత్ ఇండియన్ ఇన్‌చార్జి మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వి.కోట అధ్యక్షులు ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధుడికి చేయూత



వృద్ధుడిని తీసుకొస్తున్న కన్నన్ తదితరులు

కుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిస్సహాయంగా కనిపించిన ఓ వృద్ధుడిని స్థానికులు చేరదీసి ఆయన స్వస్థలమైన తమిళనాడుకు పంపారు. వివరాలు ఇలా.. కుప్పం పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఒక పల్లపు ప్రాంతంలో శుక్రవారం వయో వృద్ధుడు తారసపడ్డారు. కనీసం నడవలేని స్థితిలో నిస్సహాయంగా ఉన్న అతడి గురించి టీడీపీ నియోజకవర్గ విస్తరణ విభాగం కమిటీ సభ్యుడు కన్నన్ తెలుసుకుని ఆ ప్రాంతానికి వెళ్లారు. కడుపు నిండా భోజనం పెట్టి ఆకలి తీర్చారు. ప్రయాణపు ఖర్చులకు నగదు ఇచ్చి దగ్గరుండి బస్సు ఎక్కించి తమిళనాడులోని స్వస్థలానికి వృద్ధుడిని పంపారు. మాజీ ఎంపీటీసీ కృష్ణన్, దళిత నాయకులు నాగరాజు, దిలీప్ పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కల్లాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు శుక్రవారం డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. రెడెప్ప అనే రైతు సాగుచేసిన మొక్కజొన్న పంటలో డ్రోన్లతో ఎరువులు పిచికారీ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. టమోటా, బీన్స్, మొక్కజొన్న లాంటి పంటలకు వచ్చే చీడల నివారణకు పంట మధ్యలో వెళ్లి పురుగుమందుల పిచికారీ కష్టమవుతుందని డ్రోన్ల సాయంతో సులభమవుతుందన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి డ్రోన్ పరికరాలు వ్యవసాయశాఖ నుంచి పొందే విధానం వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆప్టా క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజోతి): ఏపీ టీచర్స్ ప్రైమరీఅసోసియేషన్ (ఆప్టా) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను డీఈవో వరలక్ష్మి శుక్రవారం చిత్తూరులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా అధ్యక్షులు లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, అసోసియేట్ అధ్యక్షులు ఎహసానుల్లా, అదనపు కార్యదర్శి అన్సర్, కార్యదర్శి శంకర్‌రెడ్డి, సభ్యులు మహమ్మద్ అలి, అమరావతి, యమున, సమీఉల్లాఖాన్, దాదాపీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వేగవంతం



మరమ్మతు పనులకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు మండలంలోని ఈడిగపల్లె నుంచి చెంబకూరు వరకు రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో దాదాపు 2.50 కిలోమీటర్ల వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలాట వెంకటరమణ, పులి వెంకటరమణ, గుర్రప్ప, శ్రీనివాసులు, సతీశ్, కృష్ణమూర్తినాయుడు, విజయ్‌కుమార్, హరి, శంకర్, రామాంజులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల సంత తనిఖీ

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శుక్రవారం జరిగిన ఎద్దుల సంతను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా విజిలెన్స్ అధికారిణి ఇందుమతి సభ్యులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంతలో పశువుల కొనుగోళ్లకు సంబంధించి రికార్డులు పరిశీలించారు.

గడువు ముగిసిన ఎరువులు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగపద్మిని

సోమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ నాగపద్మిని హెచ్చరించారు. శుక్రవారం సోమల, కందూరు, నంజంపేటల్లో ఎరువు దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, కుమార్, జ్యోతి ఆదితరులు పాల్గొన్నారు.

సిఫార్సు లేఖలతో కులధ్రువీకరణ పత్రాలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రామకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఈడిగల కుల ధ్రువీకరణ పత్రాలను మండల ఈడిగ సంక్షేమ సంఘం సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుని మంజూరు చేయాలని శుక్రవారం ఆ సంఘం నేతలు తహసీల్దారు బాబుకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నేతలు త్యాగరాజు, బాలాజీ, నాగరాజు, రఘు, గుణ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై ధ్యానాభిరాముడు



బైరెడ్డిపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత వాహనంపై స్వామివారు విహరించారు. సీతాలక్ష్మణసమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు



లోకనాథంనాయుడు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని పులిచెర్ల, రొంపిచెర్ల ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లోకనాధనాయుడు దంపతులను శుక్రవారం హెచ్‌ఎం ఫజురుల్లా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెలకువలతో రోడ్డుప్రమాదాల నివారణ

గంగవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ చిన్నపాటి మెలకువలను పాటిస్తే ప్రమాదాల నివారించవచ్చని పలమనేరు ఎంవీఐ మధుసూదన్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీసాయి చైతన్య జూనియర్ కాలేజ్, ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, ప్రమోద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తులు

సదుం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం మండలంలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని.. మండలానికి 49 యూనిట్లు మంజూరైట్లు ఎంపీడీవో హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రాయితీతో మంజూరు చేస్తున్న రుణ సదుపాయాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని. ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తులు ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని కోరారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

పుంగనూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు రెడ్డెప్ప, మున్సిపల్ ఉద్యోగి రమణలను పలువురు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ శివ, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి కృషిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం గంగవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రుణాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి శ్రీకారం చుట్టిన మహనేత నందమూరి తారక రామారావు అని కొనియాడారు. రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఏపీఐఐసీ నుంచి స్థలాలను కేటాయించి ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. అనంతరం మండలంలోని 127 గ్రూపులకు రూ.20.43 కోట్ల రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, అశోక్ టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రసాద్‌నాయుడు, యుగంధర్, రవి, జనసేన దిలీప్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● గంగవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవార్చాల్సిన బాధ్యత అధికారులదేనని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆయన అధికారులతో సమీక్షించారు. పలు ప్రధాన సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, తహసీల్దార్ మాధవరాజు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, రామ్మోహన్, సతీష్, మురళీ, గిరిధర్ గోపాల్, యుగంధర్, రవి, హరిబాబు, రహీంఖాన్, చిట్టిబాబు, అనంద్, మొగిలీశ్వర్, రాము, చంద్రశేఖర్, బాలాజీలతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగబాబు సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 2న సోమలలో రాష్ట్ర జనసేన నాయకులు నాగబాబు సభను విజయవంతం చేయాలని పుంగనూరు నియోజకవర్గ జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చదళ్లలో విలేకరులతో మాట్లాడుతూ 'జనసేన పార్టీ జనంలోకి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు పగడాల రమణ, శివకుమార్‌రెడ్డి, చిన్నరాయల్, విరూపాక్షి, చైతన్య రాయల్, శ్రీరామాంజనేయులు, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

● సోమల: సోమలలో ఈనెల 2న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం సోమల హైస్కూల్‌లో సభ ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం రాయల్, చిన్నారాయల్, పగడాల రమణ, శివారెడ్డి, విరూపాక్షి, చరణ్‌రాయల్, కైవారం మురళీ, నరేష్ రాయల్ పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడుపల్లె మండలంలో ఈడిగ కులానికి కేటాయించిన ప్రభుత్వ మద్యం దుకాణం లైసెన్సు కోసం దరఖాస్తు చేసువాలని ఎక్సైజ్ సీఐ ఎ.నాగరాజు కోరారు. నియోకవర్గానికి చెందిన నాలుగు మండలాల ఈడిగ సమాజిక వర్గం నేతలతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నేటివిటీ, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు రుసుంగా రూ.2 లక్షలు చలానా, డీడీ రూపంలో చెల్లించాలని చెప్పారు. సమావేశంలో ఈడిగ సామాజిక సంఘం అధ్యక్షుడు ఈఎం.సుధాకర్, నారాయణమూర్తి, శివశంకర్, త్యాగరాజు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు పరిరక్షించాలి

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆలయ భూములను పరిరక్షించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పలమనేరులోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ గాలిగోపుర భూమి పూజకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కమలాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు సన్మానం

వి.కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వి.కోట బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసి శుక్రవారం పదవీ విరమణ చెందిన పరశురామనాయుడిని సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి శబరీష్, ఎస్ఈసీ చైర్మన్ అమానుల్లా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి ఆవులతో రైతులకు అదనపు ఆదాయం



పశువులకు చికిత్సలు చేస్తున్న డాక్టర్ దినేష్‌రెడ్డి

చౌడేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాడి ఆవులతో రైతులు అదనపు ఆదాయం పొందొచ్చని పశువైద్యాధికారి డాక్టర్ దినేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అంకుతోటపల్లెలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్సలు అందించారు కార్యక్రమలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సోమల: పాడి రైతులు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సోమల పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం నెల్లిమందలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 760 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరి ప్రసాద్, సతీష్‌నాయుడు, జయచంద్ర, పురుషోత్తం నాయుడు, రమేష్‌నాయుడు, ఈశ్వర్ యాదవ్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మండలంలో ఈనెల 12 నుంచి 31 వరకు ప్రభుత్వం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాలు ముగిశాయి. వారణాశివారిపల్లె, చిచ్చిలివారిపల్లె, గానుగచింత, పెద్దగొట్టిగళ్లు, పెద్దమల్లెల, మోటుమల్లెల, రొంపిచెర్లలో శుక్రవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టరు శ్రీధర్, ఎల్ఎస్ఏ అరుణ, ఎస్.అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని రిలయన్స్ పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం బైరెడ్డిపల్లి మండలం ఎర్రకదిరేపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానిటరింగ్ సమావేశాలపై నిర్లక్ష్యం వీడాలి

సోమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సమావేశాలను పలువురు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి మాటూరు మురళి వాపోయారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ బెన్నురాజ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, కమ్యూనిటీ భవనానికి స్థల సేకరణ కోసం అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులు

● పోలీసులకు అప్పగింత

పుంగనూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో పొలాల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలు... మండలంలోని గుడిసిబండ పంచాయతీ గూడూరుపల్లె సమీపంలోని శంకరప్ప పొలంలో టమోటా పంట కోసం నిల్వ ఉంచిన కట్టెలను దొంగలించడానికి వచ్చిన ఇద్దరు యువకులు పట్టుబడటంతో వారిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. మండలంలోని గద్దూరుకు చెందిన రాఘవేంద్ర, బసాపురంకు చెందిన రెడ్డిలు కలిసి పొలాల వద్ద నిల్వ చేసిన టమోటా కట్టెలు చోరీ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇద్దరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరమని.. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పలమనేరు వైద్యఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి జయశంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను పరిశీలించారు. వైద్యసిబ్బంది జగదీశ్వరి, ఇంద్రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎద్దుల పరుషకు వేలం

వి.కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో జరుగనున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎద్దుల పరుషకు నిర్వహించిన వేలంతో రూ.1.56 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ధర్మకర్త సీతారామయ్య, సర్పంచ్ పీఎస్ లక్ష్మీ తెలిపారు. ఈనెల 6 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని.. 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు ఎద్దుల పరుష జరుగుతుందని పేర్కొన్నారు. ఈవో శివశంకర్, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రామకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల నేపథ్యంలో బల్ల గ్రామానికి చెందిన గవర్నర్ అనే వ్యక్తిపై రామకుప్పం పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు... బల్లకు చెందిన మునిరత్నంకు అదే గ్రామానికి చెందిన గవర్నర్‌కు మధ్య కొంతకాలంగా భూతగదా నడుస్తోంది. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం వారి మధ్య వాగ్వాదం జరిగింది. గవర్నర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు మునిరత్నంను కులం పేరుతో దూషించారు. దీంతో మునిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో వైభవంగా పూజలు



కుప్పంలో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న పీఎస్ఎం తదితరులు



కల్లూరు: కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న చల్లా రామచంద్రారెడ్డి



పలమనేరులో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అత్మార్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పలమనేరు వాసవి వైభవ కమిటీ ఆధ్వర్యంలో జరితతగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్వీ బాలాజీ, సత్యప్రకాష్, సీతారామయ్య, రాజప్పశెట్టి, నరేంద్ర, కార్తీక్, శ్యామ్, బాలాజీ, శ్రీకాంత్, కృష్ణమూర్తి, నాగరాజు, పలమనేరు, గంగవరం నాయకులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

● కుప్పం: కుప్పం పట్టణం కొత్తపేటలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, స్థానిక వినాయకస్వామి ఆలయంనుంచి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. పూజల్లో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, గోపీనాథ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం పూర్వజన్మ సుకృతమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలోని బజారువీధిలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పుట్టా అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో రమేష్‌శెట్టి, రాజేష్, అమూరి మహేష్, హేమంత్‌రాజు, రెడ్డి విజయ్‌కుమార్, బాలాజీ, మచారం మహేష్, అరుణ్‌కుమార్, ప్రతాప్, కేశవ, పవన్‌కుమార్, టీడీపీ నాయకులు రామనాధం నాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, ధనం జయనాయుడు, సుబ్బారెడ్డి, గోపినాయుడు, కరుణాకర్‌నాయుడు, అబ్బాస్, మహేష్, నాగనాజనాయుడు, రమేష్, నూర్‌భాషా, ఖాదర్‌వల్లి, బాస్కర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు: స్థానిక బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ పూజలు శుక్రవారం పుంగనూరులో అర్చకులు ఘనంగా నిర్వహించారు.

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ ఆత్మార్పణ దినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: రామకుప్పం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. అనంతరం టీడీపీ నేతలు ఆలయ నిర్వాహకులకు అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని అందజేశారు.

● సోమల: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కందూరు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కన్యకా పరమేశ్వరికి అభిషేకం



ఎమ్మెల్యే జగన్మోహన్‌కు ఆలయ నిర్వాహకుల స్వాగతం

చిత్తూరు కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్రాహ్మణ వీధి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం నుంచి 101 బిందెల పవిత్ర జలం ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించి లలిత సహస్రనామ సామూహికంగా పారాయణం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం: మురళీమోహన్



గొడుగుచింత బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. గొడుగుచింత గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ సర్వీసును ప్రారంభించారు. గతంలో గొడుగుచింత నుంచి పోలవరం మీదుగా చిత్తూరుకు మూడు సర్వీసులు నడిచేవని, ఇక నుంచి ఐదు సర్వీసులు నడుస్తాయని చెప్పారు. రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రజలు పడే అవస్థలను చూసి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఈ సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం బస్సులో టిక్కెట్టు తీసుకుని ప్రయాణికులతో కొద్దిదూరం ప్రయాణించారు. చిత్తూరు టూ డిపో మేనేజర్ రూపశ్రీ, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, సీనియర్ టీడీపీ నేత బాబూరావు, నాయకులు దాము, జయప్రకాష్, మునిరాజు, సర్పంచ్ మోహనమ్మ, ఆర్టీసీ డిపో యూనియన్ నేతలు జీవానంద్, చిరంజీవి, వినోద్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు: ఏడీఏ



అరగొండలో మందులను పరిశీలిస్తున్న శివకుమార్

తవణంపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏడీఏ శివకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అరగొండలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఒకే రైతుకు ఎక్కువ బస్తాల ఎరువులు విక్రయించకూడదని సూచించారు. రైతుకు విధిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: మన గ్రోమోర్ ఎరువుల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఏడీఏ శివకుమార్, ఏవోలు ప్రవీణ్, చరిత పాల్గొన్నారు.

సింగిల్ విండోలో తనిఖీలు

ఐరాల: ఐరాల సింగిల్ విండోను ఏడీఏ శివకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు తదితరాలకు సంబంధించి ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ రికార్డులు సక్రమంగా లేవన్నారు. ప్రస్తుతానికి సింగిల్ విండోలోని 12.350 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలిపివేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లికి బయల్దేరిన వరసిద్ధుడి ఆలయ ప్రచార రథం



ఐరాల(కాణిపాకం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి ఆలయంలో ఈనెల 4న నిర్వహించనున్న రథసప్తమి వేడుకల కోసం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రచార రథం శుక్రవారం పంపుతున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం ఆలయంలోని సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు చేశాక ప్రచార రథంలో అధిష్ఠింపజేశారు. ప్రచార రథాన్ని కొంత సమయం ఆలయ పుష్కరిణి వద్ద భక్తుల దర్శనార్థం ఉంచారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలకు పాలాభిషేకం



వెదురుకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు శుక్రవారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో టీడీపీ శ్రేణులు, ఈడిగ సంఘ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈడిగ కులస్తులకు మద్యం దుకాణాలను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈడిగ సంఘ నాయకులు తంబయ్య, వేలాయుధం, రుక్కుబాబు, టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగ్రాయ యాదవ్, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ మెంబరు రాజేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి: జడ్పీ సీఈవో



ముదిగోళం అంగన్వాడీ కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న రవికుమార్

ఐరాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని జడ్పీ సీఈవో రవికుమార్ అన్నారు. శుక్రవారం ముదిగోళం సచివాలయం, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

'బెంగళూరు - బలిజకండ్రిగ' కర్ణాటక ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

పాలసముద్రం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని దేవసంద్ర బస్టాండ్ నుంచి పాలసముద్రం మండలం బలిజకండ్రిగకు శుక్రవారం కర్ణాటక ఆర్టీసీ సర్వీసును డిపో మేనేజర్ నేత్ర ప్రారంభించారు. బెంగళూరులో ఉదయం 8.30 బయల్దేరి మధ్యాహ్నం 2.30గంటలకు బలిజకండ్రిగకు చేరుకుని, రాత్రి ఏడు గంటలకు బలిజకండ్రిగ నుంచి తిరిగి బెంగళూరుకు బస్సు వెళుతుందన్నారు. ఈ సర్వీసు కోసం కేశవరాజు, ఎస్.కేశవరాజులు కృషిచేశారని స్థానికులు తెలిపారు. ఈ సర్వీసు ప్రారంభించడంపై కర్ణాటక ఆర్టీసీ అధికారులకు టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



గంగాధర నెల్లూరు స్కూల్ అసిస్టెంట్ భారతి త్యాగరాజు పదవీ విరమణ సందర్భంగా సన్మానిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు



హైరోడ్డులో మార్కింగ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



దీనబంధుపురం క్రాస్‌వద్ద మరమ్మతులకు గురైన బస్సు

పాలసముద్రం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సు శుక్రవారం దీనబంధుపురం క్రాస్‌వద్ద ఆగిపోయింది. వారంలో ఒకటి, రెండ్రోజులు ప్రయాణికులకు ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా కండీషన్‌లోని బస్సులను ఈ మార్గంలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హైరోడ్డు విస్తరణకు మార్కింగ్

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు రోడ్డు విస్తరణలో భాగంగా శుక్రవారం మార్కింగ్ పనులు చేపట్టారు. వెంకుశ కళ్యాణ మండపం నుంచి కట్టమంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు మార్కింగ్ పనులు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రైవేటు నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలు, తదితర వాటిని గుర్తించారు. మార్కింగ్ పనులు పూర్తయ్యాక తొలగింపు చేపడతామని ఏసీపీ నాగేంద్ర తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం / ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభజన చట్టం హామీల అమలు విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తోందని వెల్లడించారు. ఏపీ మంత్రుల విన్నపాలకు అఖిల పక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర పరిస్థితులను వివరించడానికి తాము కోరిన సమయాన్ని కూడా ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు.

వీధి బాలలను సంరక్షిద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వీధి బాలలను సంరక్షిద్దామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ ఎంఎస్ భారతి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో వీధి బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీధి బాలల సమాచారం పోలీసులకు, చైల్డ్ వెల్ఫేర్ వారికి తెలియజేయాలన్నారు. వారు ఆ పిల్లల్ని బడిలో చేర్పించి, చదువుకునేలా ప్రోత్సహిస్తారన్నారు. బడి మానేసిన పిల్లల కోసం కేజీబీవీలు, అనాథ పిల్లలు, వీధి బాలలుంటే ఎన్జీవోల ఆధ్వర్యంలో నడిచే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్ యోజన హాస్టళ్లు ఉన్నాయన్నారు. ఒకే ప్రాంతంలో 20 మంది పిల్లలుంటే వారికి విద్యా వలంటీర్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి, డీఎస్పీ విజయశేఖర రాజు, ఎస్ఐ నాగసౌజన్య, డీవైఈవో చంద్రశేఖర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బాలసుబ్రహ్మణ్యం, ఏఐసీ నరోత్తంరెడ్డి, పాఠశాల హెచ్ఎం జెస్సిక, ఎస్ఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రహ్మణ్యం

యాదమరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద జంగాలపల్లె గ్రామంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు, క్యాటిల్ షెడ్డు, సప్లై చానల్ పనులను శుక్రవారం ఏపీడీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. సకాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆగ్రో ఫారెస్ట్ ఓరియెంటేషన్ అవగాహన కల్పించారు. ఏపీవో బాల, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, డాక్టర్ భూపతి, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని ఎదిరించలేకే నిరాధార ఆరోపణలు: వైసీపీ

చిత్తూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదిరించలేకనే టీడీపీ ఎమ్మెల్యేలు పథకం ప్రకారం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు.

పెద్దిరెడ్డిని విమర్శించడం తగదు : సునీల్

బంగారుపాళ్యం: మాజీ మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం టీడీపీ నాయకులకు తగదని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలుపై దృష్టి పెట్టాలన్నారు. మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, కిషోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరి వైసీపీ రైతు విభాగ అధ్యక్షుడిగా తోయదాక్షి



నిండ్ర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ వైసీపీ రైతు విభాగ అధ్యక్షుడిగా నిండ్ర మండలం అగరం పంచాయతీ డీకే చేడుకు చెందిన తోయదాక్షి నియమితులయ్యారు.

మాజీ మంత్రిని కలిసిన లీగల్ సెల్ బాబు

విజయపురం: మాజీ మంత్రి రోజాను నియోజవర్గ లీగల్ సెల్ న్యాయవాది బాబు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట శివరాజు ఉన్నారు.

పాడుబడ్డ బావిలో గుర్తుతెలియని మృతదేహం

గంగాధరనెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరువీధికుప్పం గ్రామానికి సమీపంలో పాడుపడ్డబావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. హెడ్‌కానిస్టేబుల్ దామోదరం తెలిపిన మేరకు.. బావిలో మృతదేహం తేలుతున్నట్లు వీఆర్వో సురేష్ గంగాధరనెల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. చనిపోయిన వ్యక్తికి 60-65 ఏళ్ల వయసు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రామకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల నేపథ్యంలో బల్ల గ్రామానికి చెందిన గవర్నర్ అనే వ్యక్తిపై రామకుప్పం పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు... బల్లకు చెందిన మునిరత్నంకు అదే గ్రామానికి చెందిన గవర్నర్‌కు మధ్య కొంతకాలంగా భూతగదా నడుస్తోంది. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం వారి మధ్య వాగ్వాదం జరిగింది. గవర్నర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు మునిరత్నంను కులం పేరుతో దూషించారు. దీంతో మునిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మెడికల్ వ్యర్థాలతో ప్రమాదం



లక్కరాజు మిట్ట వద్ద నగరి రోడ్డు పక్కనే బావిలో తేలుతున్న మెడికల్ వ్యర్థాలు

విజయపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మెడికల్ వ్యర్థాలతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నూరు సబ్‌స్టేషన్‌లో చిన్న చిన్న క్లినిక్‌లు ఏర్పాటవడంతో మెడికల్ వ్యర్థాలను ఇష్టానుసారం రోడ్డు పక్కన బావుల్లో, గుంతల్లో పడేస్తున్నారు. రోగులకు వాడేసిన సిరంజీలు, సెలైన్ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తుండటంతో నీరు విషపూరితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

సీఎంకు ప్రభుత్వ విప్ థామస్ వినతి



కృష్ణమనాయుడు, థామస్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

గంగాధరనెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు ఇవ్వాలని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ థామస్ కోరారు. ఈ మేరకు అమరావతిలోని సెక్రటేరియట్‌లో సీఎం చంద్రబాబును పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు కలిసి విన్నవించారు.

నాగాలమ్మకు పూజలు

గంగాధరనెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం గ్రామానికి సమీపంలో నాగాలమ్మకు కారకట్టి వంశస్తులు శుక్రవారం పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. బాలకృష్ణారెడ్డి, దేవరాజులురెడ్డి, నీరజాక్షులురెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శిస్తే ఖబడ్దార్: టీడీపీ

గుడిపాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబును విమర్శిస్తే ఖబడ్దార్ అని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు హెచ్చరించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్ రాయల్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెప్పారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినం



ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను నిర్వాహకుల స్వాగతం

నగరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ జిల్లా కార్యదర్శి రుక్కుం బాలాజి, నగరి వైశ్య సంఘం అధ్యక్షుడు రవీంద్రబాబు, కార్యదర్శి కోటీశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలి

సీఐకి జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి ఫిర్యాదు



సీఐ హనుమంతప్పకు ఫిర్యాదు చేస్తున్న యుగంధర్ తదితరులు

వెదురుకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గంగమాంబాపురంలో జనవరి 28వ తేదీన జరిగిన గొడవల్లో టీడీపీ నేత మహే‌ష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి, మాల కార్పొరేషన్ మెంబరు డాక్టర్ యుగంధర్ పొన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐ హనుమంతప్పకు జనసైనికులతో కలసి ఫిర్యాదు చేశారు. లోకనాథరెడ్డి, మహేష్ మధ్య జరిగిన గొడవల్లో లోకనాథరెడ్డిని రిమాండుకు పంపించారని తెలిపారు. మహేష్‌పైనా చర్యలు తీసుకోవాలని సీఐకి విన్నవించారు.

నాగబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

ఆదివారం సోమలలో నాగబాబు పర్యటనను జనసేన శ్రేణులు విజయవంతం చేయాలని యుగంధర్ పిలుపునిచ్చారు.

ఓంశక్తి భక్తులకు అన్నదానం

బంగారుపాళ్యం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబువారిపల్లె పంచాయతీలోని ఓంశక్తి భక్తులకు అదే గ్రామానికి చెందిన నరసింహులు నాయుడు కుమారుడు విజయ్ నాయుడు శుక్రవారం అన్నదానం చేశారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి

ఐరాల(కాణిపాకం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ మహేష్ కుమార్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

గంగాధరనెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బంగారెడ్డిపల్లె పంచాయతీలో అంగన్వాడీ కేంద్రాలను, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను శుక్రవారం ఎంపీడీవో హరిప్రసాదరెడ్డి తనిఖీ చేశారు.పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

పశు ఆరోగ్య వైద్య శిబిరం

శ్రీరంగరాజపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. శుక్రవారం మెదవాడ గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేసి, వైద్యపరీక్షలు చేశారు.

డైరీ ఆవిష్కరణ

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ముద్రించిన 2025 డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, నాయకులు దేవకి, రుక్మాంగద, బాబు, పరంధామనాయుడు, తులసి, ప్రసూన కుమారి, తదితరులు పాల్గొన్నారు.

షమీర్‌శర్మ మృతి తీరని లోటు : కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జైన్ ఫ్యాక్టరీస్ వైస్ ప్రెసిడెంట్ మృతి షమీర్‌శర్మ మృతి జిల్లా రైతాంగానికి, పండ్ల పరిశ్రమకు తీరనిలోటని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో షమీర్‌శర్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌బాబి, కట్టమంచి బాబి, కోటేశ్వర్‌రావు, బాలసుబ్రమణ్యం, పండ్ల పరిశ్రమల అధినేతలు శివకుమార్, తలపలపల్లి బాబురెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కేజే కుమార్‌కు పలువురి శుభాకాంక్షలు



నగరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం నగరిలో ఘనంగా జరిగాయి. చిత్తూరు జిల్లా ఈడిగ కుల చైర్మన్ కృష్ణమూర్తి, ఆటో కార్మికులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

పోషణ వాటికపై అవగాహన

వెదురుకుప్పం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ వర్కర్లకు కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మసునంద పోషణ వాటికపై శుక్రవారం అవగాహన కల్పించారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, కిశోర వికాసం గ్రూపులు గ్రామ స్థాయిలో ఎలా పనిచేయాలన్న విధానాలను తెలియజేశారు. ఎంపీడీవో అమరనాథ్, ఉద్యోగులు హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న మహమ్మద్ అజీజ్ - చెన్నయ్య

చిత్తూరు సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో.. నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి యు.చెన్నయ్య ఉన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

నిండ్ర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిండ్ర ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను సన్మానించారు. ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో టీచర్లు దేవయ్య, షఫీ ఉద్యోగ విరమణ పొందడంతో సన్మానించారు. ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్, హెచ్ఎం అరుణకుమారి, టీచర్లు పాల్గొన్నారు.